# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :303 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేదీ: శుక్రవారం 14-02-2025 | పేజీలు:4 వెల: 2.00


### చికెన్, మటన్ సెంటర్లలో శుభ్రత పాటించాలి : మహ్మద్ నియాజ్

సుల్తానాబాద్ : పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని చికెన్, మటన్, సెంటర్ దుకాణ యజమానులు శుభ్రత పాటించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రం లోని పలు చికెన్, మటన్, సెంటర్లను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సి పల్ కమిషనర్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం చికెన్, మటన్, సెంటర్ యజమానులు తమ దుకాణాలలో శుభ్రత పాటించి వ్యర్థ పదార్థాలు నిలువ లేకుండా చూడాలన్నారు. బ్లీచింగ్ పౌడర్ చల్లి ఈగలు, దోమలు దరిచేరకుండా చూడాలని, స్వచ్ఛమైన మంచినీరును శుభ్రపర చేందుకు వాడాలన్నారు. ప్రజలకు నాణ్యతతో కూడిన చికెన్, మటన్, విక్రయించాలని, ఎట్టి పరిస్థితిలో మృతి చెందిన కోళ్లను, మేకలను, కోసి విక్రయించవద్దని సూచించారు. ప్రజల జీవితాలతో చెలగాటం ఆడితే సహించమని హెచ్చరించారు. అలాగే కోళ్ళు , మేకలు నుంచి వచ్చిన వ్యర్థాన్ని డ్రైనేజీలలో ఊరు చివర రోడ్ల పక్కన పడేసిన వారిపై చర్యలు తీసుకొని జరిమానాలు విధిస్తామన్నారు. శుభ్రత పాటించకపోతే జరిమానాలు తప్పవని ఇకనుండి నుంచి తరచూ తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

## సాంకేతిక రంగంలో సత్తాచాటాలి...



హైదరాబాద్,ఫిబ్రవరి13: యువత సాంకేతికరంగంలో తమ సత్తాను చాటాలని, అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మైక్రోసాఫ్ట్ విస్తరణతో యువతకు మరిన్ని ఉద్యోగాలు లభించనున్నా యని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో మరో కొత్త మైక్రోసాఫ్ట్ ఫెసిలిటీని ప్రారంభించుకోవడం మనందరికీ గర్వకారణంగా ఉందని తెలిపారు. హైదరాబాద్ జర్నీలో ఇదొక మైలురాయి అని చెప్పారు. మైక్రోసాఫ్ట్, హైదరాబాద్ మధ్య సుదీర్ఘ భాగస్వామ్యం ఉందని అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో మైక్రోసాఫ్ట్ విస్తరణలో భాగంగా నూతన భవనాన్ని గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... హైదరాబాద్‌లో ఏఐ సెంటర్ ఏర్పాటుకు మైక్రోసాఫ్ట్‌తో తమ ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకున్నట్లు ప్రకటించారు. మైక్రోసాఫ్ట్ ఇండియా ఇటీవలే 25 ఏళ్లు పూర్తి చేసుకుందని గుర్తుచేశారు. మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ నుంచి గ్లోబల్ ఇన్నోవేషన్, ఇంపాక్ట్ క్రియేట్ చేసిందని తెలిపారు. ఇది యువతకు మరింత సాధికారత కల్పిస్తుందని చెప్పడానికి తాను సంతోషిస్తున్నానని తెలిపారు. భవిష్యత్తు ఇక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దేనని ఉద్ఘాటించారు. ఈ భాగస్వామ్యంతో తెలంగాణ, మైక్రోసాఫ్ట్ 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను ప్రవేశపెట్టడంతో పాటు గవర్నెన్స్ అండ్ పబ్లిక్ సర్వీసెస్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించనుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ పెట్టుబడి తమ స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయడంతోపాటు మెంటార్‌షిప్, ఏఐ టూల్స్, గ్లోబల్ నెట్‌వర్క్ యాక్సెస్‌ను చేస్తుందని అన్నారు. తమ ప్రభుత్వ సహకారంతో మైక్రోసాఫ్ట్ ఏఐ సెంటర్ ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఈ కేంద్రం ఏఐ నాలెడ్జ్ హబ్ సహా క్లౌడ్ ఆధారిత ఏఐ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తుందన్నారు. తెలంగాణపై నమ్మకం ఉంచిన మైక్రోసాఫ్ట్ లీడర్ షిప్ టీమ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆవిష్కరణల పట్ల మీ నిబద్ధత మా తెలంగాణ రైజింగ్ విజన్‌కు తోడవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## భారత సరిహద్దుల్లో కొనసాగుతున్న ఉద్రిక్తత.. ఐదుగురు సైనికులు మృతి



పూంచ్ : పూంచ్ జిల్లాలోని బాలకోట్ సెక్టార్‌లోని భారత సైనిక స్థావరాలపై పాకిస్తాన్ సైన్యం నిన్న కాల్పులు జరిపింది. దీనికి ప్రతిస్పందనగా భారత సైన్యం కూడా పాకిస్తాన్ పోస్టులపై కాల్పులు జరిపి తగిన సమాధానం ఇచ్చింది. వర్గాల నుండి అందిన సమాచారం ప్రకారం.. పాకిస్తాన్ భారీ నష్టాలను చవిచూసింది. ఈ షెల్లింగ్‌లో చాలా మంది పాకిస్తాన్ ఆర్మీ సైనికులు గాయపడ్డారు. దాదాపు ఐదుగురు సైనికులు గాయపడ్డారు. పాకిస్తాన్ గత వారం రోజులుగా %బాజ% ద్వారా ఉగ్రవాదులను చొరబాట్లకు ప్రయత్నిస్తోంది. భారత సైన్యం అత్యంత అప్రమత్తంగా ఉంది. అందువల్ల పాకిస్తాన్ ప్రతి కుట్రకు భారత సైన్యం తగిన సమాధానం ఇస్తోంది. పాకిస్తాన్ చేస్తున్న నిరంతర కుట్రల దృష్ట్యా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈరోజు జమ్మూలో ఉన్నత స్థాయి భద్రతా సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో లెఫ్టినెంట్ గవర్నర్‌తో పాటు, జమ్మూ కాశ్మీర్ డిజిపి నళిన్ ప్రభాత్, జమ్మూ కాశ్మీర్ పోలీసు ఉన్నతాధికారులు, జమ్మూ ఐజిపి పాల్గొంటారు. జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలోని నియంత్రణ రేఖ వెంబడి నుండి ఎటువంటి కవ్వింపు లేకుండా జరిగిన కాల్పులకు భారత సైన్యం తగిన సమాధానం ఇచ్చిందని, ఈ కాల్పుల్లో పెద్ద సంఖ్యలో పాకిస్తాన్ సైనికులు మరణించారని భద్రతా అధికారులు తెలిపారు. కృష్ణ ఘాటి సెక్టార్‌లో పాకిస్తాన్ కాల్పుల విరమణను ఉల్లంఘించిందని అధికారులు తెలిపారు. జమ్మూ జిల్లాలోని అఖ్నూర్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ సమీపంలో అనుమానిత ఉగ్రవాదులు జరిపిన IED పేలుడులో కెప్టెన్‌తో సహా ఇద్దరు భారత సైనిక సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. జమ్మూ కాశ్మీర్‌లోని అఖ్నూర్ సెక్టార్‌లోని ఎల్‌ఓసి సమీపంలో మంగళవారం జరిగిన ఐఇడి పేలుడులో ఒక కెప్టెన్, ఒక సైనికుడు అమరులయ్యారు. ఒక సైనికుడు గాయపడ్డాడు. అతన్ని ఆర్మీ ఆసుపత్రిలో చేర్చారు. అమరవీరులైన సైనికులను కెప్టెన్ కరమ్‌జిత్ సింగ్, నాయక్ ముఖేష్ సింగ్‌గా గుర్తించారు. ఈ పేలుడు ఉగ్రవాదుల కుట్ర. అధికారుల ప్రకారం, ఆర్మీ సిబ్బంది ఎల్‌ఓసి సమీపంలో పెట్రోలింగ్ విధుల్లో ఉన్నారు.

## పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి నోటీసులు...

హైదరాబాద్,ఫిబ్రవరి13: కోడిపందేల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి మొయినాబాద్ పోలీసులు గురువారం నోటీసులు ఇచ్చారు. కోడి పందాలు జరిగిన ల్యాండ్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి చెందినదిగా పోలీసులు నోటీసుల్లో పేర్కొన్నారు. మొయినాబాద్ తోల్కట్ట గ్రామం సర్వే నెంబర్ 165/ఏలో ఈ ఫార్మ్‌హౌస్ ఉందని పోలీసులు తెలిపారు. నాలుగు రోజుల్లో ఆధారాలతో తమ ముందు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి హాజరు కావాలని నోటీసుల్లో పోలీసులు పేర్కొన్నారు. ఇప్పటికే ఈ కేసులో పోచంపల్లిని నిందితుడిగా మొయినాబాద్ పోలీసులు చేర్చారు. సెక్షన్ 3 అండ్ 4 గేమింగ్ యాక్ట్ కింద్ కేసు నమోదు చేశారు. సెక్షన్ 11 యానిమల్ యాక్ట్ కింద మరో కేసు నమోదు చేశారు. ఫార్మ్ హౌస్‌లో బెట్టింగ్స్ చేస్తూ పందాలు ఆడిస్తున్నట్లు మొయినాబాద్ పోలీసులు గుర్తించారు. శ్రీనివాస్ రెడ్డి ఫార్మ్‌హౌస్‌ను సబ్ లీజుకు భూపతి రాజు శివకుమార్ వర్మ అలియాస్ గబ్బర్ తీసుకున్నారు. ఫార్మ్‌హౌస్‌లో భారీ సెటప్‌తో కోడి పందాలను గబ్బర్ నిర్వహించాడు. అయితే కోడిపందాలకు సంబంధించి మరి కొంతమందిని విచారించే అవకాశాలు ఉన్నాయి. కాగా.. మూడు రోజుల క్రితం నగర శివారులో భారీ క్యాసినోను పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన కలకలం రేపింది. మొయినాబాద్‌లోని ఫామ్ హౌస్‌పై దాడి చేసిన రాజేంద్రనగర్



పోలీసులు.. కోళ్ల పందాలతోపాటు క్యాసినో నిర్వహిస్తున్న ముఠా గుట్టు రట్టు చేశారు. ఈ ఘటనలో 64 మందిని అరెస్టు చేశారు. రూ. 30 లక్షల నగదుతోపాటు 55 కార్లు, 86 కోళ్లు స్వాధీనం పరుచుకున్నారు. పెద్ద మొత్తంలో బెట్టింగ్ కాయిన్స్ కూడా సీజ్ చేశారు. పట్టుబడినవారిలో ఏపీ, తెలంగాణకు చెందినవారు ఉన్నట్లు సమాచారం. నగరానికి చెందిన పలువురు ప్రముఖులు కలిసి క్యాసినో, కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

## వంశీ అరెస్ట్ వ్యవహారం.. టీడీపీ-వైసీపీ మధ్య మాటల యుద్ధం



అమరావతి, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్టుతో ఒక్కసారిగా ఏపీలో రాజకీయాలు వేడెక్కాయి. సోషల్ మీడియా వేదికగా అధికార టీడీపీ-విపక్ష వైసీపీ మధ్య విమర్శలు మొదలయ్యాయి. పాపం పండిందని టీడీపీ రాసుకొస్తే.. కక్ష సాధింపు రాజకీయాలు కాదా అంటూ వైసీపీ ప్రశ్నించడం మొదలైంది.

రివేంజ్ రాజకీయాలొద్దు-బొత్స

వల్లభనేని వంశీ అరెస్టుపై మాజీ మంత్రి బొత్స రియాక్ట్ అయ్యారు. కక్షపూరితంగా వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో ప్రజలే సమాధానం చెబుతారన్నారు. అరెస్టులపై ఉన్న ఫోకస్, పాలనపై పెడితే బాగుంటుందన్నారు. మీ ఇష్టం వచ్చినట్లు మీరు చేయండి.. చట్ట పరంగా మేం పోరాటం చేస్తామన్నారు. మరో నాలుగేళ్లు పోయిన తర్వాత మీ విధానంపై మాట్లాడుదామన్నారు. నిన్నటికి నిన్న హైకోర్టు సైతం పోలీసు వ్యవస్థపై మొట్టికాయలు వేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి కామెంట్స్ చూస్తుంటే ప్రభుత్వానికి బాధ అనిపించలేదా అంటూ ప్రశ్నించారు.

టీడీపీ ఏమంది?

వల్లభనేని వంశీ అరెస్టుపై టీడీపీ నేత పట్టాభి రియాక్ట్ అయ్యారు. టీడీపీ రాష్ట్ర స్థాయి బీసీ నాయకుడు దొంతు చిన్నపై వంశీ అనుచరులు దాడి చేసి, వాహనాలను ధ్వంసం చేశారన్నారు. ఆయనను తీసుకుని పోలీసుస్టేషన్‌కు వెళ్లాలని నిర్ణయించామన్నారు. తాను గన్నవరం వెళ్తున్న సమయంలో వంశీ ఆఫీసు బయట దాదాపు వందల సంఖ్యలో ఆయన అనుచరులు ఉన్నారని వివరించారు. తాము పోలీసులతో మాట్లాడుతున్న సమయంలో పార్టీ ఆఫీసుపై దాడులు ఆపై వాహనాలు తగులబెట్టారని గుర్తు చేశారు. దారిలో మాపై దాడులు చేశారన్నారు. చివరకు మా వాహనంపై కాకుండా పార్టీ ఆఫీసుపై దాడి చేశారని చెప్పుకొచ్చారు. బీసీ నేతపై దాడి చేస్తే ప్రశ్నించకూడదా అంటూ ప్రశ్నలు లేవనెత్తారు. చివరకు మాపై కేసులు నమోదు చేశారన్నారు. తమను స్టేషన్‌లో గంటపాటు చిత్రహింసలు గురి చేశారన్నారు. తమను రాజమండ్రి జైలుకి రెండువారాల పాటు పంపించారన్నారు. మా పార్టీ ఆఫీసు వ్యక్తి ఫిర్యాదు చేసినందుకు ఆ వ్యక్తిని బెదిరించి వంశీ మద్దతుదారులు కిడ్నాప్ చేశారు. అతడి చేత బలవంతంగా స్టేట్‌మెంట్ ఇచ్చారని తెలిపారు పట్టాభి. బెదిరించి, కిడ్నాప్ చేసిన కేసులో వంశీని అరెస్ట్ చేశామన్నారు. చేసిన అరాచకం చాలక ఫిర్యాదుదారులను బెదిరిస్తారా అంటూ రుసరుసలాడారు. తమకు శాంతి భద్రతలు ముఖ్యమన్నారు. బీసీ నాయకుడికి రక్షణగా తాము వెళ్లామన్నారు. చట్ట బద్ధంగానే అరెస్ట్ చేశామన్నారు. వంశీ భార్య రియాక్షన్ పై నోరు విప్పారు. తాము ఏ రోజూ వంశీ ఫ్యామిలీ గురించి మాట్లాడ లేదన్నారు. చివరకు సభలో అధినేత భార్య గురించి నీచంగా మాట్లాడ లేదా? అంటూ రుసరుసలాడారు. ఆనాడు మీడియా ముందు చంద్రబాబు కన్నీరు పెట్టడానికి వంశీ కారణం కాదా? అంటూ ప్రశ్నలు రైజ్ చేశారు.

వంశీ భార్య ఏమన్నారు?

గురువారం ఉదయం పోలీసులు ఇంటికి వచ్చారని తెలిపారు. ఎందుకు అరెస్టు చేస్తున్నారని అడిగితే నోరు మెదపలేదని, ఎలాంటి నోటీసులు ఇవ్వలేదన్నారు. అప్పటికప్పుడు రాసి నోటీసులు ఇచ్చారు. ఇంకా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదన్నారు. తాము చాలా ప్రశ్నలు వేశామని, వారికి అర్థం కాలేదన్నారు. అసలు వల్లభనేని వంశీ విజయవాడకు వెళ్లలేదన్నారు. పోలీసులంతా వంశీకి తెలుసన్నారు. పోలీసులకు ఫోన్ చేసి తొందరగా అరెస్ట్ చేయాలని చెబుతున్నారని వివరించారు. ఎన్ని కేసులు పెట్టినా బెయిల్ తెచ్చుకున్నామని తెలిపారు.

## రీసర్వే కాదు.. ఇది మిస్ అయిన వారి కోసం మాత్రమే!



హైదరాబాద్,రాష్ట్ర వ్యాప్తంగా పకడ్బందీగా సర్వే చేశాం అని, మిస్ అయిన వారి కోసం మరో అవకాశం ఇస్తున్నాం అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇది రీసర్వే కాదని, ఇది మిస్ అయిన వారికోసం మాత్రమే అని స్పష్టం చేశారు. సర్వేలో పాల్గొనని బీఆర్ఎస్ వారికి సర్వే గురించి మాట్లాడే అర్హత లేదని మండిపడ్డారు. రాజకీయ విమర్శల కొసమే బీసీ ముస్లింల మీద బీజేపీ వారు విమర్శలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్‌లోని మూడు పదవులలో ఒకటి బీసీకి కెటాయించే విధంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గారు చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ఎద్దేవా చేశారు .కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. 'రాష్ట్ర వ్యాప్తంగా పకడ్బందీగా సర్వే చేశాం. మిస్ అయిన వారి కోసం మరో అవకాశం ఇస్తున్నాం. ఇది రీసర్వే కాదు.. ఇది మిస్ అయిన వారికోసం మాత్రమే. సర్వేలో పాల్గొనని బీఆర్ఎస్ వారికి సర్వే గురించి మాట్లాడే అర్హత లేదు. బీజేపీ వ్యాపారస్థుల పార్టీ, వారికి రిజర్వేషన్లు ఇష్టం లేదు, కులగణనకి వారు వ్యతిరేకం. రిజర్వేషన్ల విషయంలో తాము వ్యతిరేకం అని కోర్టులో అఫిడవిట్ ఇచ్చిన పార్టీ బీజేపీ. ఎన్నికలు సర్వే తర్వాతనే జరుగుతాయి' అని మంత్రి పొన్నం చెప్పారు. 'ప్రజాస్వామ్యం మీద మీకు విశ్వాసం ఉంటే సర్వేలో పాల్గొనాలి. రాజకీయ విమర్శల కొసమే బీసీ ముస్లింల మీద బీజేపీ వారు విమర్శలు చేస్తున్నారు. ముస్లిం కమ్యూనిటీలోని పేద ముస్లింలు చాల రోజుల నుండి బీసీలోనే ఉన్నారు. సమగ్ర కుటుంబ సర్వేని ఎందుకు బయటపెట్టలేదు. బీఆర్ఎస్‌లోని మూడు పదవులు ఒక బీసీకి కెటాయించే విధంగా కల్వకుంట్ల కవిత గారు చర్యలు తీసుకోవాలి. కవితక్క మూడు పదవులలో బీసీలకి కెటాయించేలా కరీంనగర్ నుండే ఉద్యమం చేయాలి. రాహుల్ గాంధీ పర్యటన మీద దుష్ప్రచారం చేయాలని చూస్తున్నారు' అని మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్ అయ్యారు.

## అర్చకులు రంగరాజన్‌పై దాడి కేసు.. రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు!

హైదరాబాద్,చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధానార్చకులు సీఎస్ రంగరాజన్‌పై దాడి కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటి వరకూ ఈ కేసులో ప్రధాన నిందితుడు వీర రాఘవ రెడ్డి సహా ఆరుగురిని అరెస్ట్ చేశారు. నిజామాబాద్‌కి చెందిన నాగనపల్లి సాయన్న, ఖమ్మంకి చెందిన భూక్యా గోపాల్ రావు, భూక్యా శ్రీను, అంకోలు శిరీష, బేబి రాణిలు అరెస్ట్ అయ్యారు. ప్రధాన నిందితుడు వీర రాఘవ రెడ్డిపై అబిడ్స్, బంజారాహిల్స్, గోల్కొండ పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయి. నిందితుల రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నెల 7న 20 మంది నిందితులు (మహిళలు, పురుషులు) సీఎస్ రంగరాజన్ ఇంటికి వెళ్లారు. రామదండు కోసం మనుషులను రిక్రూట్ చేయాలని, అలానే ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. రంగరాజన్ అందుకు వ్యతిరేకించినందుకు మొహం, శరీరంపై దాడికి పాల్పడ్డారు. మణికొండ పంచవటి కాలనీలో ఈనెల 8న వీర రాఘవరెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో చేసిన నేరాన్ని రాఘవ రెడ్డి ఒప్పుకున్నాడు. దాడికి ముందు ఏ2గా ఉన్న నిందితుడు సాయన్నను దమ్మాయిగూడలోని ఉదా రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో కలుసుకున్నారు. రాఘవ రెడ్డి 2014లో ఆంధ్ర అసోసియేషన్ ఫర్ తెలంగాణ, ఆంధ్ర పీపుల్ పేరుతో సంఘాన్ని ఏర్పాటు చేశాడు. హిందూ ధర్మాన్ని కాపాడతానని దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం ప్రత్యేక ఫోర్స్ ను సిద్ధం చేయాని భావించాడు. ఇందు కోసం ఫేస్ బుక్, యూట్యూబ్ ఛానెళ్ళు ఏర్పాటు చేసి ప్రసంగాలు ఇచ్చి ప్రేరేపించాడు. రాఘవ రెడ్డి మణికొండలో నూతన న్యాయ చట్టాలపై అవగాహన కోసం సమావేశం ఏర్పాటు చేశాడు. 2022లో భార్యను చైర్మన్ గా పెట్టి కోసలేంద్ర ట్రస్ట్ ప్రారంభించాడు. దీని ద్వారా ఫండ్ కలెక్ట్ చేశాడు. ఉత్తర్ ప్రదేశ్ కి చెందిన శ్యామ్ అనే వ్యక్తి సాయంతో రామరాజ్యం వెబ్ సైట్ ను ప్రారంభించాడు. 10 నెలల క్రితం రాఘవ రెడ్డి ఓ యూట్యూబ్ ఫాలోవర్ ద్వారా జనవరి 25న రంగారాజన్ ను కలిశాడు. అతను చెప్పి ప్రతిపాదనకు రంగరాజన్ స్పందించలేదు. నిందితులు గత నెల 25న పెనుగొండలోని వాసవి కన్యాకాపరమేశ్వరి గుడిలో కలుసుకున్నారు. ఈ నెల



4న రాఘవ రెడ్డి స్నేహితుడు, న్యాయవాది అయిన దామోదర్ రెడ్డి సాయంతో దమ్మాయిగూడలో ఉదా రెడ్డి ఇంట్లో కలుసుకున్నారు. రంగరాజన్ ను మరోసారి కలిసి మాట్లాడాలని, వినకుంటే దాడి చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 7న ఉదయం 8 గం సమయంలో రంగరాజన్ ఇంటికి వెళ్లారు. రంగరాజన్ స్నానానికి వెళ్ళి వచ్చిన తర్వత మాట్లాడతాను అని చెప్పినా వినకుండా దాడికి పాల్పడ్డారు. తాము చెప్పినట్లు వినకపోతే ఇక్కడి నుంచి తీసుకెళ్తామని, పరిస్థితులు దారుణంగా ఉంటాయని బెదిరించారు. దాడి చేసి వీడియోలను అప్లోడ్ చేశారు. కేసులో మొత్తం 22 మందిని నిందితులుగా పోలీసులు చేర్చారు. మరో 16 మంది నిందితులు పరారీలో ఉన్నారు. వీర రాఘవ రెడ్డిపై గతంలో అబిడ్స్ లో లైంగిక వేధింపుల కేసు ఉంది.

### హిమాయత్ నగర్‌లో భారీ చోరీ..

భాగ్యనగరంలో దోపిడీలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. దుండగులు భారీగా బంగారం, నగదును దోచుకెళ్తున్నారు. హైదరాబాద్ నగరంలో ఇటీవలి రోజుల్లో వరుస చోరీలతో జనాలు భయబ్రాంతులకు గురవుతున్నారు. తాజాగా హిమాయత్ నగర్‌లో భారీ చోరీ జరిగింది. ఓ బంగారం వ్యాపారి ఇంట్లో భారీగా బంగారం, నగదు దోచుకెళ్లారు దొంగలు. వ్యాపారి లబోదిబోమంటూ హిమాయత్ నగర్ పోలీసుల దగ్గరకు వెళ్లి ఫిర్యాదు చేశాడు.

## పెండింగ్ పాల బిల్లులు వెంటనే చెల్లించాలి : జైపాల్ యాదవ్

కడ్తాల్ ఫిబ్రవరి 13: పాడి రైతులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్(జైపాల్ యాదవ్) డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై పాడి రైతులు నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు సంఘీభావం తెలిపాయి. ఈ సందర్భంగా పాడి రైతులు రోడ్డుపై పారబోసి నిరసన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న జైపాల్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో పాల బిల్లులు చెల్లించిన పాడి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు వరకు. 74 రోజులుగా పాల బిల్లులు రా బాడీ రైతులకు పశు పోషణ భారమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే బిల్లులను చెల్లించి పాడి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రైతుబంధు, రుణమాఫీ పథకాలు సక్రమంగా అమలు కాలేదని. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ వెంకటేష్ గుప్తా, మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నరసింహ రెడ్డి, తలకొండపల్లి మండల బీఆర్ఎస్ మండల అధ్యక్షులు



శంకర్, బిజెపి మండల అధ్యక్షులు మహేష్, బిఆర్ఎస్ కడ్తాల్ గ్రామ అధ్యక్షులు రామకృష్ణ, నాయకులు గంప శీను, దశరథం, మోహన్ రెడ్డి, ఎలమందరెడ్డి, జంగయ్య, జగన్ యాదవ్ మహేష్, నరసింహ, అశోక్ రెడ్డి, శేఖర్, రాములుయాదవ్, యాదయ్య, పాడి రైతులు వరకు.

# కాంగ్రెస్‌తో పొత్తుపై 'ఆప్' చూపిన విముఖతకు మూల్యం చెల్లించుకుంది




న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీలో 70 స్థానాలకుగాను 48 సీట్లను గెలుచుకొని బిజెపి 27 ఏళ్ల తర్వాత అధికారాన్ని దక్కించుకుంది. ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థులు రెండవ స్థానం దక్కించుకున్న 13 సీట్లలో 'ఆప్' అభ్యర్థులకు తగ్గిన ఓట్ల కన్నా ఎక్కువ ఓట్లు కాంగ్రెస్ పార్టీ సాధించింది.కాంగ్రెస్ పార్టీ 2013 వరకు వరుసగా మూడు పర్యాయాలు ఢిల్లీని పరిపాలించింది. ఆ తరువాత నుండి వరుస పరాజయాలు చవిచూస్తూ ఆందోళనకర పరిస్థితులలో చిక్కుకు పోయింది. వరుసగా మూడవసారి కూడా ఒక్క సీటు గెలుచుకోలేకపోయింది. అయితే ఈ సారి ఎన్నికల మీద మాత్రం కొంత ప్రభావాన్ని చూపించింది.అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, సౌరభ్ భరద్వాజ్ వంటి ఆప్ అగ్ర నాయకులు ఆయా నియోజకవర్గాల్లో రెండవ స్థానంలో ఉన్నారు. వీళ్ల ఓటమికి దారి తీసిన తగ్గిన ఓట్ల కన్నా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. న్యూఢిల్లీ నియోజకవర్గంలో కేజ్రీవాల్ 4,089 ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. అదే నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నిలబడిన మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ కుమారుడు, రెండు సార్లు పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన సందీప్ దీక్షిత్‌కు 4,568 ఓట్లు వచ్చాయి.జంగ్‌పురా నియోజకవర్గంలో మనీష్ సిసోడియా కేవలం 675 ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి చవిచూశారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ మేయర్ ఫర్హాద్ సూరికి 7,350 ఓట్లు పోలయ్యాయి. గ్రేటర్ కైలాష్ నియోజకవర్గంలో భరద్వాజ్ 3,188 ఓట్ల తేడాతో ఓటమి చవిచూస్తే అక్కడ పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గర్విత్ సింఘ్వికి 6,711 ఓట్లు వచ్చాయి.ఈ 13 సీట్లకు తోడుగా ఆల్ ఇండియా మజ్లిస్- ఎ - ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) కూడా ముస్తాఫాబాద్‌లో తన ప్రభావాన్ని చూపింది. 2020 మత ఘర్షణలతో సమస్యాత్మకంగా మారిన ఈశాన్య ఢిల్లీ నియోజకర్గాల్లో ఆప్ విజయావకాశాలను దెబ్బతీసింది. మాజీ ఆప్ నేత, మత ఘర్షణల కేసును ఎదుర్కొంటున్న తాహిర్ హుస్సేన్ ఈ సారి ఎఐఎంఐఎం టికెట్ మీద పోటీ చేసి 33,474 ఓట్లు సాధించాడు. ఈ నియోజకవర్గంలో 'ఆప్' అభ్యర్థి అదీల్ అహ్మద్ ఖాన్ 17,578 ఓట్ల తేడాతో ఓటమిని చవిచూశాడు.

# రాజ్యసభకు కమల్ హాసన్! సీఎం నుంచి స్పష్టమైన హామీ వచ్చేసిందట..



తమిళనాడు: తమిళ సూపర్ స్టార్, నటుడు, రాజకీయ నాయకుడు కమల్ హాసన్ ను రాజ్యసభకు నామినేట్ చేస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. తమిళనాడు రాష్ట్రం నుంచి డీఎంకే పార్టీ కమల్ ను పెద్దల సభకు నామినేట్ చేస్తుందని సమాచారం. జూలైలో రాజ్యసభ ఎన్నికలు జరగనున్నాయి.ఈ ప్రచారం తెరపైకి రావడానికి కారణం లేకపోలేదు. తమిళనాడు మంత్రి పీకే శేఖర్ బాబు బుధవారం కమల్ ఇంటికి వెళ్లారు. కమల్ ను కలిశారు. ఆయనతో మాట్లాడారు. మీకు రాజ్యసభ సీటు కన్ ఫర్మ్ చేసినట్లు చెప్పారట.కమల్ హాసన్ కు చెందిన మక్కల్ నీది మయం పార్టీ గత ఏడాది జరిగిన లోక్ సభ ఎన్నికల్లో డీఎంకే కూటమికి మద్దతుగా ప్రచారం చేసింది. పొత్తులో భాగంగా మక్కల్ నీది మయ్యమ్ పార్టీకి 2025 ఏడాదికి ఒక రాజ్యసభ సీటు ఇస్తామని అప్పట్లో వాగ్దానం ఇచ్చారట. ఈ డీల్ లో భాగంగా, లోక్ సభ ఎన్నికల్లో మద్దతు ఇచ్చినందుకు, మిత్ర ధర్మం పాటిస్తూ.. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్.. కమల్ హాసన్ కు రాజ్యసభ సీటు ఇస్తామని హామీ ఇచ్చారట.కాగా, దేశం కోసమే తమ పార్టీ కూటమికి మద్దతు ప్రకటించిందని, తాను ఏ పోస్టు ఆశించలేదని అప్పట్లో కమల్ హాసన్ చెప్పారు. జూన్ లో 6 రాజ్యసభ సీట్లు ఖాళీ కానున్నాయి. ఈ క్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రామిస్ ను కమల్ హాసన్ కు చేరవేశారు మంత్రి శేఖర్ బాబు. మిమ్మల్ని పెద్దల సభకు పంపిస్తామని కమల్ హాసన్ తో ఆయన చెప్పినట్లు సమాచారం.డీఎంకేతో ఒప్పందం మేరకు కమల్ హాసన్ పార్టీ మక్కల్ నీది మయ్యం 2024 లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఆ ఎన్నికల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైపై కోయంబత్తూరు నుంచి పోటీ చేయాలని కమల్ అనుకున్నారు. అయితే, డీఎంకే నుంచి వచ్చిన విజ్ఞప్తితో ఆయన పోటీకి దూరంగా ఉన్నారు. అదే సమయంలో రాజ్యసభ సీటు ఇస్తామని కమల్ కు డీఎంకే నుంచి ఆఫర్ వచ్చింది.అది కూడా ఆ రాజ్యసభ సీటు కమల్ కు మాత్రమే ఇస్తామని చెప్పిందట.మక్కల్ నీది మయం పార్టీ పోటీ చేసిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని చవిచూసింది. ఆ తర్వాత లోక్ సభ ఎన్నికల సమయంలో ఇండియా కూటమికి మద్దతు ఇచ్చింది.కూటమి అభ్యర్థుల విజయానికి కమల్ కృషి చేశారు.ఎన్నికల్లో కాంగ్రెస్ స్థానాల్లో ఒక స్థానం నుంచి కమల్ పోటీ చేస్తారనే ప్రచారం జరిగింది. అయితే, ఆ సమయంలో లోక్ సభకు వెళ్లేందుకు కమల్ సిద్ధంగా లేరు.

# రోజురోజుకు పడిపోతున్న చికెన్ ధరలు



హైదరాబాద్,కొందరికి ముక్క లేనిదే ముద్ద దిగదు ప్రతిరోజూ కాదు ప్రతిపూటా చికెన్ తినేవారు వుంటారు. ఇక హైదరాబాద్ లో వుండేవారు కనీసం వారానికి ఒక్కసారైనా చికెన్ బిర్యానీ రుచిచూడకుండా వుండలేరురోజూ తినేవారు కూడా వుంటారు. చికెన్ లెగ్ పీస్ ఇష్టపడేవారు కొందరయితే, మెత్తని చెస్ట్ పీస్ ను ఇష్టంగా తినేవారు మరికొందరు ఇంకొందరు వింగ్స్, లివర్ వంటివి ఇష్టపడతారు. ఇలా చికెన్ బిర్యానీనో లేక చికెన్ కర్రీనో లేదంటే కబాబ్ వంటి స్పెషల్ వంటలో ఏదో ఒకరూపంలో ముక్క నోట్లో పడాల్సిందే అనేవారు చాలామంది వుంటారు.ఇలా నాన్ వెజ్ అంటే పడిచచ్చేవారు ఇప్పుడు అయోమయ పరిస్థితిలో ఉన్నారు. చికెన్ కిలో రూ.300, రూ.400 ఉన్నపుడు కూడా వెనకడుగు వేయకుండా కొనుగోలు చేసినవారు ఇప్పుడు కిలో కాదు కోడికి కోడే కేవలం 150 రూపాయలకు ఇస్తామన్నా తీసుకోడానికి జంకుతున్నారు. నాలుక ముక్క కోసం తహతహలాడుతున్నా చికెన్ తినలేని పరిస్థితి వచ్చింది. ఈ పరిస్థితి పగవాడికి కూడా రాకూడదని అనుకుంటున్నారు నాన్ వెజ్ ప్రియులు.అసలు ఎందుకు చికెన్ ధరలు ఇంతలా తగ్గాయి? నాన్ వెజ్ ప్రియులు చికెన్ తినడానికి ఎందుకు జంకుతున్నారు ? ఏకంగా ప్రభుత్వాలే చికెన్ తినొద్దని ఎందుకు హెచ్చరిస్తున్నాయి ? లక్షలాదిగా కోళ్ళు ఎందుకు చనిపోతున్నాయి ? ఈ ప్రశ్నలన్నింటిని ఒకటే సమాధానం బర్డ్ ఫ్లూ. ఈ మహమ్మారి వైరస్ విజృంభణతో దేశంలోనే కాదు తెలుగు రాష్ట్రాల్లో మరోసారి ఆంక్షలు తప్పడంలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బర్డ్ ఫ్లూతో లక్షలాదిగా కోళ్లు చనిపోతుండడంతో ఏపీ నుంచి వస్తున్న కోళ్లను తెలంగాణలో తీసుకోవడం లేదు. ప్రస్తుతం బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ కారణంగా చికెన్ ధరలు కిలో రూ.150లు ఉండగా, త్వరలో మరింత తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరో బర్డ్ ఫ్లూతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

# పంచాయితీ ఎన్నికల వేళ కులాల బుజ్జగింపులు




హైదరాబాద్, తెలంగాణలో పంచాయితీ ఎన్నికల వేళ కుటగణన చిచ్చురేపుతోంది. పార్టీపరంగా బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అందిస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక అసెంబ్లీ సమావేశంలో ప్రకటించారు. అన్ని పార్టీలు ఇలాగే చేయాలన్నారు. అసెంబ్లీలో బిల్లు పెట్టాలని బిజెపి, బిఆర్ఎస్ చేసిన డిమాండ్ ముందుకు రాలేదు. సుప్రీం తీర్పు మేరకు రిజర్వేషన్లు 50శాతం మించరాదు. దీంతో బిల్లు పెట్టే ప్రసక్తి ఉండదు.

కానీ రాజకీయంకోసం బిఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఇప్పుడు అదే నినాదంతో ఊరూవాడా ఊరేగుతోంది. ఎన్నికల సందర్భ ంగా ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కులగణన చేపట్టింది. అది ఏ మేరకు చట్టబద్ధతతో, ఎన్ని విధాలుగా ఉపయోగపడుతుందో కాలమే చెప్పాలి. ఇప్పటికే ఓట్ల కోసం బిసి లెక్కలు వేసిన కర్ణాటక, బీహార్, ఎపి రాష్ట్రాలు బిసి జనాభాకు కొత్తగా చేసిందేమీ లేదు. కేంద్రం చొరవలేకుండా జనాభా లెక్కలకు విలువ లేదని రాష్ట్రాలకు కూడా తెలుసు. జనాహభా లెక్కల ద్వారానే బిసిల లెక్కలు తేల్చాలన్న డిమాండ్ కూడా ఉంది. ఎస్సి రిజర్వేషన్లలో విభజనను రాష్ట్రాలు చేసుకో వచ్చని సుప్రీం కోర్టు తేటతెల్లం చేసింది. దీంతో తెలంగాణలో ఓ అడుగు ముందుకు పడింది. అయితే అది సమగ్రంగా లేదని తాజాగా మందకృష్ణ అంటున్నారు. ఎబిసిడి వర్గీకరణ చేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఎస్సీ వర్గీకరణపై ఆగస్టు 2024లో సుప్రీం ఈ మాట చెప్పినా బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఒక్కటి కూడా రిజర్వేషన్ల అంశంపై చర్చించడం లేదు. ఆయా రాష్ట్రాల్లో ఒత్తిడి కూడా కనిపించడం లేదు. తెలంగాణలో మాత్రమే ప్రభుత్వం అధ్యయన కమిటీని వేసి, 60 రోజుల్లో దళిత ఉపకులాల లెక్కల నివేదిక ఇవ్వాలని అక్టోబర్ 2024లో ఏకసభ్య కమిషన్ నియమించింది. నివేదిక రావడంతో అసెంబ్లీలో దీనిని ప్రవేశ పెట్టారు. ఆమేరకు రిజర్వేషన్లు ప్రకటించారు. తెలంగాణలో బిసిలను, మాదిగలను మచ్చిక చేసుకునే ప్రయత్నాల్లో బిజెపిక దూకుడు పెంచింది. వారికి తామే వారసులం అన్నరీతిలో ప్రకటనలు చేస్తున్నారు. రాజ్యాంగబద్ధంగా రాష్టులు ఎస్సి రిజర్వేషన్లను ఉపకులాలకు పంచవచ్చని సుప్రీకోర్టు చెప్పింది. తెలంగాణ ఈ విషయంలో రెండు అడుగులు వేసింది కాబట్టి ఆయా నేతలతో వాటి అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలి అనే వ్యూహంలో ఉన్నాయి. అందుకే ఒకరికి రాజ్యసభ సభ్యత్వం ఇచ్చి, మరొకరికి పద్మశ్రీ ఇచ్చింది. తెలివిగా బిసి ఉద్యమనేత కృష్ణయ్యకు రాజ్యసభను, ఎస్సీవర్గీకరణ కోసం పోరాడిని మందకృష్ణకు పద్మశ్రీని ప్రకటించింది. ఇది రాజకీయ లబ్దికోసంచేసిందే తప్ప ప్రేమతో చేసింది కాదు. ఒకరికి పద్మశ్రీ, మరొకరికి రాజ్యసభ పదవి కట్టబెడితే ఆయా నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న వర్గాలకు లభించేదేమిటన్నదే ప్రశ్న. కులాల పరంగా వారికి న్యాయం చేయకుండా ఇలాంటి డ్రామాలు చేస్తున్నారు. ఇవ్వాళ్ళ ఈ గౌరవాలు ఇచ్చిన ప్రభుత్వం తమ డిమాండ్లను కూడా సానుకూలంగా పరిష్కరిస్తుందని భరోసా ఇవ్వగలరా. ఇప్పుడు బిసిలకు గాని, మాదిగలకు గాని వారి డిమాండ్లపై నిజాయితీగా పోరాడే కొత్త శక్తితో వీరు ముందుకు రావాలి. రాజకీయంగా సాధించే పటిమను ప్రదర్శించాలి. పంచాయితీ ఎన్నికల్లో ఆయా వర్గాలు తమ డిమాండ్లపై దృష్టి పెట్టి రాకీయ పార్టీల మెడలు వంచాలి.

# రియల్‌రంగంలో ది బెస్ట్ స్టేట్.. దేశంలోనే రెండో స్థానంలో!




హైదరాబాద్,రాష్ట్రం మళ్లి రియల్‌రంగంలో పునరుత్తేజం దిశగా ఎదుగొందుతోంది. రియల్‌రంగంలోని ఒక్కో రంగం ఒక్కో తీరుగా వెలుగులీనుతోంది. జిల్లాల్లో కొంతమేర ఆదాయం తగ్గినప్పటికీ మెట్రో నగరం హైదరాబాద్ నగరం రియల్ ఎస్టేట్ రంగంలో ప్రధానంగా ఆఫీస్ స్పేస్‌లో దేశంలోనే గొప్ప నగరంగా మారుతోంది.రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ రంగం కాస్త వెనుకబడినట్లు అనిపించింది. సేల్స్ నెమ్మదించాయి. కొత్త లీజింగ్ ట్రాన్సాక్షన్స్ తగ్గిపోయినట్లు పలు కన్సల్టెన్సీలు రిపోర్టులు వెల్లడించాయి. అయితే మళ్లీ ఇప్పుడు ఈ ఆర్థిక సంవత్సరం చివర్లో కార్యాలయ స్థలాలకు డిమాండ్ విపరీతంగా పెరిగింది.ప్రముఖ సంస్థలు తమ వ్యాపార విస్తరణ కోసం హైదరాబాద్ నగరాన్ని కీలక స్థానంగా భావిస్తున్నట్లు తెలిపింది. హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్ డిమాండ్ పెరిగేందుకు ఇక్కడ ఉన్న మౌలిక సదుపాయాలతో పాటుగా అనుకూలంగా ఉండే వ్యాపార విధానాలు, స్థిర ప్రభుత్వం వంటివి తోడ్పడుతున్నట్లు నివేదిక పేర్కొంది.ఇంకా ఇతర ప్రధాన మెట్రో నగరాలతో పోలిస్తే స్థిరాస్తి ధరలు అందుబాటులో ఉండటం.. నిపుణుల లభ్యత కూడా అనుకూలంగా ఉండటం వంటివి కారణంగా నిలుస్తున్నాయి. ఈ క్రమంలోనే హైదరాబాద్‌పై ఇన్వెస్టర్లు, రియల్ ఎస్టేట్ డెవలపర్లు, ఇతర సంస్థలు కూడా సానుకూలంగా ఉన్నట్లు నివేదిక వెల్లడించింది.సమీప భవిష్యత్ విస్తరణ ప్రణాళికలకు వీలుండేలా చూసుకోవడం సహా ఆధునిక వసతులు, కీలక ప్రాంతాల్లోని గ్రేడ్ ఏ కమర్షియల్ ప్రాజెక్టులకు ఎక్కువ డిమాండ్ ఉందని రిపోర్ట్ తెలిపింది.అంతర్జాతీయ సంస్థల నుంచి డిమాండ్ పెరుగుతుండడం, పెట్టుబడుల గమ్యస్థానంగా మారుతున్న తరుణంలో హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్ డిమాండ్ అంచనాలకు మించి పెరిగిపోతుందని.. రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ సర్వీసెస్ సంస్థ సీబీఆర్ఈ వెల్లడించింది.ఈ సంస్థ హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్ప్రైసెస్ అసోషియేషన్ సంయుక్తంగా విడుల చేసిన నివేదికలో.. దేశీయంగా మిగతా నగరాలతో పోల్చితే ఆఫీస్ స్పేస్ కు హైదరాబాద్ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారిందని ఈ నివేదిక వెల్లడిస్తోంది. రానున్న రోజుల్లో ఈ డిమాండ్ ఇలానే పెరుగుతూ.. 2030 నాటికి 20 కోట్ల చదరపు అడుగులకు చేరుకుంటోందని వెల్లడించింది.ప్రస్తుతం నగరంలో 1.37 కోట్ల చదరపు అడుగుల మేర ఆఫీస్ స్పేస్ వినియోగంలో ఉన్నట్లు తెలిపిన ఈ నివేదిక.. గత పదేళ్లతో పోల్చితే దాదాపు మూడు రెట్ల ఆఫీస్ స్పేస్ హైదరాబాద్ నగరంలో అందుబాటులోకి వచ్చినట్లు తెలిపింది.ప్రస్తుతం దేశంలో ఐటీ సహా ఇతర విభాగాల్లో అనేక సంస్థలున్న బెంగళూరు, ఢిల్లీ, చెన్నై వంటి నగరాల కంటే హైదరాబాద్ వైపు ఇంటర్నేషనల్ సంస్థలు ఆసక్తి ప్రదర్శిస్తున్నట్లు తెలిపిన సీబీఆర్ఈ నివేదిక.. ప్రధాన నగరాల్లో ఉన్న ఆఫీసు స్థలంలో హైదరాబాద్ వాటా 15శాతంగా ఉన్నట్లు వెల్లడించింది.ఇందులో 18శాతం గ్రీన్ సర్టిఫైడ్ ఆఫీస్ స్టాక్‌గా పేర్కొంది. హైదరాబాద్ నగరంలో 2024లో 1.23 కోట్ల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ బుకింగ్ అయ్యింది. ఇందులో.. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డాటా అనలటిక్స్ వంటి రంగాలు ఎక్కువగా ఆఫీస్ స్పేస్ రెంట్‌కు తీసుకున్నట్లు వెల్లడైంది.మొత్తంగా టెక్నాలజీ సంస్థల వాటానే 31శాతంగా ఈ నివేదిక వెల్లడించింది. గతంలో ఐటీ రంగాలకు చెందిన సంస్థల నుంచి 30-35 శాతం డిమాండ్ ఉంటుండేది. కానీ.. ఇప్పుడు ఇతర రంగాల నుంచి సైతం పోటీ ఎక్కువ అవుతుండడం, ఆయా రంగాల సంస్థలు ఎక్కువగా ఆఫీస్ స్పేస్ రెంటుకు తీసుకుంటుండడంతో ఐటీ సంస్థల వాటా తగ్గిపోతున్నట్లు నివేదిక తెలిపింది.మొత్తంగా హైదరాబాద్ నగరంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మా, బయో టెక్నాలజీ, ఫైనాన్స్ రంగాల సంస్థలు హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టేందుకు, ఇక్కర అద్దెలు తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు ఎక్కువగా ఏర్పాటవుతున్నాయి.రెండేళ్ల కాలంలోనే ఈ సంస్థల ఆఫీస్ స్పేస్ వినియోగంలో 12శాతం వృద్ధి రేటు నమోదైంది. గతేడాది ఆఫీస్ స్పేస్ తీసుకున్న మొత్తం సంస్థల్లో బీసీసీల వాటానే 43శాతంగా ఉండడం ఆశ్చర్యపరుస్తోంది. ఈ సంస్థల ఏర్పాటులో బెంగళూరు మొదటి స్థానంలో ఉండగా, హైదరాబాద్ రెండో స్థానంలో ఉన్నట్లు ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.జీసీసీల్లో బెంగళూరు మొదటి స్థానంలో ఉండగా, హైదరాబాద్ నగరం రెండో స్థానంలో ఉంది. గత ఏడాదిలో 53 లక్షల చదరపు అడుగుల ఆఫీసు స్థలాన్ని జీసీసీలు అద్దెకు తీసుకున్నాయి.

### రానున్న పదేళ్లలో 1.5 రెట్ల మేర పెరుగుదల

రానున్న ఐదేళ్లల్లో హైదరాబాద్ ఆఫీస్ స్పేస్ గిరాకీ 1.5 రెట్లు పెరుగుతుందని ఈ నివేదిక అంచనా వేస్తోంది. ఈ స్థాయిలో ఆఫీస్ స్పేస్ పెరగడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రధాన కారణమని విశ్లేషించిన నివేదిక.. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చొరవతోనే ఇది సాధ్యపడుతోందని ప్రశంసించింది.మౌలిక సదుపాయాల అభివృద్ధిపై నిరంతరం దృష్టి సారించడంతో పాటు, ఆఇ, రోబోటిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలలో పెరుగుతున్న పెట్టుబడులతో హైదరాబాద్ కు ఈ డిమాండ్ ఏర్పాటినట్లు తెలుపుతోంది.అలాగే.. ఇక్కడి బలమైన పర్యావరణ వ్యవస్థ, నైపుణ్యం కలిగిన యువత లభిస్తుండడంతో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్స్ ఏర్పాటు సాధ్యమవుతోందని తెలిపింది. పైగా నగరంలో తక్కువ ధరల్లోనే అద్భుతమైన స్పేస్ అందుబాటులోకి రావడంతో పాటు ఇక్కడి వసతులు, వనరులు పెట్టుబడులను ఆకర్షించడంలో కీలకంగా పనిచేస్తున్నట్లు నివేదిక తెలిపింది.

# కేసులను తప్పదోవ పట్టించే యత్నం




హైదరాబాద్,మొగుడిని కొట్టి మొగసాలకు ఎక్కిన చందంగా ఇప్పుడు బిఆర్ఎస్ అన్ని వర్గాలకు ప్రాతనిధ్య పార్టీగా ప్రచారం చేసుకుంటోంది. రైతులపట్ల ఎక్కడలేని ప్రేమను ఒలకబోస్తోంది. వారి సమస్యలపై జిల్లాల వారీగా పోరాటాలు చేస్తోంది. ధర్నాలు చేస్తోంది. హాస్టళ్లలో పురుగుల అన్నం అని గగ్గోలు పెడుతోంది. బిసిలకు కాంగ్రెస్ ద్రోహంచేస్తోందని అంటోంది. జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారని అంటోంది. గ్రామీణ వైద్యులకు అన్యాయం జరిగిపోయిందని వారి ధర్నలకు మద్దతు ప్రకటించింది. ఇలా చెప్పుకుంటూ పోతే తెలంగాణలో సకల సమస్యలన్నీ కాంగ్రెస్ వల్లనే పుట్టుకు వచ్చాయని ప్రచారం చేసి, ఆయా వర్గాలను దువ్వే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. గతంలో ప్రజల్లోకిరాకుండా, ప్రజల సమస్యలు పట్టించుకోకుండా, తొమ్మదిన్నరేళ్లు నిరంకుశంగా పాలించిన బిఆర్ఎస్ ఇప్పుడు చిలకపలుకులతో బయలుదేరింది. ఓవైపు తమ హయాంలో జరిగిన అవినీతిపై ఓ వైపు విచారణ సాగుతోంది. వాటికి సమాధానం ఇవ్వడం లేదు. కానీ ఏడాది రేవంత్ రెడ్డి పాలనలో మాత్రం తెలంగాణ ఆగమైందని వలపోస్తున్నారు. అమృత్ పథకంలో అక్రమాలు జరిగాయని ఫిర్యాదుచేశారు. గతంలో ప్రధాని స్వయంగా కాళేశ్వరం కెసిఆర్‌కు ఎటిఎంలాగా మారిందని ప్రధాని స్వయంగా ఆరోపించారు. బిజెపి నేతలు కూడా ఆరోపించారు. వీటిని తిప్పికొట్టడం మినహా బిఆర్ఎస్ చేసిందేమీ లేదు. ఇప్పుడు కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా రేసింగ్ తదిరాల్లో అవినీతి గుప్పుమంది. అమృత్ పథకంలో భారీ స్కామ్ జరిగిందని ఆరోపిస్తూ వస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్రమంత్రికి ఖట్టర్‌కు ఫిర్యాదు చేశారు. టెండర్లు రద్దు చేసి వెంటనే ఈ విషయంపై విచారణ చేపట్టాలని సూచించారు. రేవంత్ రెడ్డి భావమరిది సృజన్ రెడ్డికి ఈ టెండర్లు అక్రమంగా కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. ఇవే కాకుండా మరిన్ని కుంభకోణాలు రాబోతున్నాయని టీజర్ కూడా ఇచ్చేశారు. సీరియల్ మాదిరి అన్ని శాఖల్లో జరిగిన అవినీతిని వెలికి తీస్తామని హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలను జాతీయ స్థాయిలోనే ఎండగడతామని ఎన్నిసార్లు అయినా ఢిల్లీ వస్తామని అన్నారు. మరోవైపు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందుకనో బిఆర్ఎస్ దూరంగా ఉంది. ఈ మధ్య కాలంలో రేవంత్ రెడ్డిపై ప్రతిపక్ష బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు చేస్తూ వస్తోంది. ఫార్ములా ఈ- కార్ రేస్ కేసులో కీలక మలుపు తిరుగుతుందని కీలక వ్యక్తులను విచారించేందుకు అవకాశం ఉందని అంటున్నారు. ఈ కేసులో కీలకంగా కేటీఆర్ పేరు వినిపిస్తోంది. అయనపై ఎసిబి విచారణ సాగుతోంది. మొత్తంగా అవినీతి కేసుల్లో బిఆర్ఎస్ నేతలు బయటపడతారా లేక విచారణతో కాలయాపన చేస్తారా అన్నది చూడాలి.

# సర్వేలో కాంగ్రెస్‌కు బిగ్ షాక్.. ఖర్గే కంటే సచిన్ పైలట్‌కు ఎక్కువ మార్కులు!



న్యూఢిల్లీ,మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వేలో కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే కంటే సచిన్ పైలట్ కాంగ్రెస్‌ను నడపడానికి మంచి ఎంపికగా సూచించారు. సర్వేలో,8.4 శాతం మంది పైలట్‌కు మద్దతుగా ఓటు వేయగా, 2.7 శాతం మంది మాత్రమే ఖర్గేకు ఓటేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నేపథ్యంలో మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వేలో కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. సర్వేలో ఉత్తమ ప్రధాని ఎవరు, కాంగ్రెస్‌కు ఉత్తమ నాయకుడు ఎవరు మొదలైన అనేక ప్రశ్నలు ప్రజలను అడిగారు. ఈ సర్వే జనవరి 2 నుంచి ఫిబ్రవరి 9 మధ్య జరిగింది. మొత్తం లక్ష 25 వేల 123 మంది సర్వేలో పాల్గొన్నారు. అయితే సర్వేలో పాల్గొన్న వారిలో 64.4 శాతం మంది కాంగ్రెస్ దేశానికి నిజమైన ప్రతిపక్ష పార్టీ అని నమ్ముతుండగా, 31 శాతం మంది కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్ష పార్టీ పాత్రను పోషించడంలో విఫలమైందని ఓటు వేశారు. అంతేకాకుండా లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ గాంధీ పనితీరును 24.8 శాతం మంది చాలా బాగుందని భావించగా.. 26.9 శాతం మంది బాలేదని ఓటు వేశారు.

### కాంగ్రెస్‌ను ఎవరు బాగా నడపగలరు?

సర్వేలో అడిగిన మరో ప్రశ్న ఏమిటంటే కాంగ్రెస్ ను ఎవరు బాగా నడపగలరు? ఇందులో మొదటి ఎంపికగా రాహుల్ గాంధీకి36.4 శాతం మంది మద్దతు తెలుపగా.. ప్రియాంక గాంధీని 11.2 శాతం మంది ఓటు వేశారు. ఆశ్చర్యకరంగా సర్వేలో, ప్రస్తుత అధ్యక్షుడు ఖర్గే కంటే సచిన్ పైలట్ కాంగ్రెస్‌ను నడపడానికి మంచి ఎంపికగా సూచించారు. సర్వేలో,8.4 శాతం మంది పైలట్‌కు మద్దతుగా ఓటు వేయగా, 2.7 శాతం మంది మాత్రమే ఖర్గేకు ఓటు వేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 99 సీట్లు గెలుచుకుంది. దీంతో ఆ పార్టీ నుంచి రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఎంపికయ్యారు. అప్పటి నుండి ఆయన సభలో కేంద్ర ప్రభుత్వంపై నిరంతరం దాడి చేస్తూనే ఉన్నారు. 2014 ,2019 తో పోలిస్తే ఈసారి కాంగ్రెస్ పనితీరు చాలా మెరుగుపడింది. ఈ కారణంగానే బీజేపీ సొంతంగా మెజారిటీ మార్కును చేరుకోలేక పోయింది. కేవలం 244 సీట్లు మాత్రమే సాధించగలిగింది. ఈ క్రమంలో కూటమి పార్టీలతో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

### ఎన్డీఏ కూటమిదే అధికారం

ఇక ఇప్పటికిప్పుడు దేశంలో ఎన్నికలు జరిగితే పరిస్థితి ఏంటన్న దానిపై కూడా సర్వే జరగగా ఇందులో కూడా కాంగ్రెస్ కు బిగ్ షాక్ తగిలింది. ఇప్పుడు ఎన్నికలు జరిగితే మరోసారి ఎన్డీఏ కూటమిదే అధికారమని సర్వేలో తేలింది. ఎన్డీఏ కూటమి 343 సీట్లు గెలిచే అవకాశం ఉందన్న సర్వే అభిప్రాయపడింది. 2024 సార్వత్రిక ఎన్నికలతో పోల్చితే కూటమికి 44 సీట్లు పెరిగే ఛాన్స్ ఉందని తెలుపగా.. ఇండియా కూటమి 44 సీట్లు కోల్పోతుందని సర్వే అంచనా వేసింది. 2024లో 232 ఎంపీ స్థానాలను ఇండియా కూటమి గెలుచుకుంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com